# నామస్మరణే తరణోపాయం

**కట్టడ యైనయట్టి నిజ కర్మము చుట్టుచు వచ్చి, యే గతిం**
**బెట్టునో పెట్టిన ట్లనుభవింపక తీరదు కాళ్ళు మీదుగా**
**గిట్టక వ్రేలుడంచు దలక్రిందుగ గట్టిరె యెవ్వరైన నా**
**చెట్టున గబ్బిలంబులకు జేరిన కర్మము గాక మానవా!**

**ప్రేమస్వరూపులారా!** నిన్నటి దినము పరీక్షిత్తు పట్టాభిషేకమును గురించి మీకు చెప్పాను. పట్టాభిషేకము తరువాత అనేకమంది అతనికి తోడునీడగా వుంటూ, తమ సహాయ సహకారముల నందిస్తూ, అతనిని అభివృద్ధికి తెప్పించారు. బాలుడైన పరీక్షిత్తును ఒక మహారాజుగా తీర్చిదిద్దడం చాలా గొప్ప విషయం. పాండవులలో ఎవ్వరూ లేరు. ధర్మరాజు, భీముడు, అర్జునుడు, నకులుడు, సహదేవుడు అందరూ హిమాచలమునకు వెళ్ళిపోయినారు. పాండవవంశంలో మిగిలినది బాలుడైన పరీక్షిత్తు మాత్రమే. సింహాసనమును అధిష్ఠించడానికి అతను తప్ప మరొక వారసుడు లేడు. ముగ్గురు గురువుల పర్యవేక్షణలో అతను సకల విద్యాపారంగతుడై, ప్రజారంజకంగా పరిపాలించి సత్కీర్తిని సాధించినాడు.

పాండవులు మహాప్రస్థానమునకు బయలుదేరేముందు జరిగిన సంఘటనలను మీకు వివరించాలి. బాలుడైన పరీక్షిత్తు, 'ఇంత పెద్ద రాజ్యమును లేతవయస్సులో ఉన్న నేను పరిపాలించగలనా? ఈ భారమును భరించగలనా?' అని ధర్మజుని పాదములపై పడి ఏడ్చాడు. ధర్మజుడుకూడా కాస్త మెత్తబడ్డాడు. అప్పుడు ద్రౌపదియే అతనికి ధైర్యం చెప్పింది. "ఏమి ధర్మజా! పరీక్షిత్తునకు, ప్రజలకు ధైర్యసాహసములను నూరిపోయవలసింది పోయి నీవుకూడా మెత్తబడుతున్నావేమిటి? ఇది మంచిది కాదు", అన్నది.

'నా గతి ఇంతేనా? నన్ను ఒంటరివాణ్ణి చేసి పోవడం మీకు న్యాయమా?' అని

sri sathyasai vachanamrutam

పరీక్షిత్తు ప్రశ్నించగా ధర్మజుడు, 'నాయనా! కాలము మనకు ఈ గతి పట్టించింది. నిన్ను విడిచిపెట్టి మేము వెళ్ళక తప్పదు. మనలను సర్వవిధముల కాపాడుతూ వచ్చిన కృష్ణ పరమాత్ముడే మనలను వదలిపోయాడు. ఇంక, మేము వెళ్ళి పోవడంలో వింత ఏమున్నది! మేముకూడను కృష్ణుని అనుసరించి వెళుతున్నాము. మొట్టమొదటినుండి మేము కృష్ణుణ్ణే ఆశ్రయించాము, ఆయననే అనుసరిస్తూ వచ్చాము. కృష్ణుడు మమ్మల్ని తన మిత్రులుగా చూశాడు, పుత్రులుగా చూశాడు, బంధువులుగా చూశాడు. అన్ని విధములుగా కృష్ణుడే మాకు గతి అని భావించాము', అన్నాడు.

పరీక్షిత్తు ఏమంటాడో విందామని అందరూ ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. పరీక్షిత్తు ధర్మరాజుతో, 'మీ ఆజ్ఞను శిరసావహించి నా కర్తవ్యాన్ని నేను నిర్వర్తిస్తాను. మీ ఆదర్శాలను అనుసరిస్తూ మీ కీర్తి నిలబెడతాను. వయస్సులో నేను చిన్నవాడినే అయినప్పటికీ కృష్ణ పరమాత్ముని అనుగ్రహముచేత, మీ ఆశీస్సులచేత నేను రాజ్యాన్ని సమర్థవంతంగా పరిపాలించగలనన్న నమ్మకం నాకున్నది', అని ధైర్యంగా చెప్పాడు. పరీక్షిత్తు మాటలు విని ద్రౌపది, ధర్మజులు చాలా ఆనందించారు. 'చిన్నపిల్లవాడు ఇంత ధైర్యంగా మాట్లాడుతున్నాడే!', అని ఆశ్చర్యపోయారు. పరీక్షిత్తును చూసి పాండవులకు కూడా తగిన ధైర్యం వచ్చింది. పరీక్షిత్తుకు రాజ్యపరిపాలనకు సంబంధించిన అనేక విషయములను బోధించారు. పట్టాభిషేకమునకు పరీక్షిత్తును ఒప్పించారు.

ఆ తరువాత ధర్మరాజు, ద్రౌపది ప్రజలందరినీ ఉద్దేశించి, 'కృష్ణ పరమాత్మ ఎక్కడికీ పోలేదు. మనవెంటనే ఉన్నాడు. మనల్ని అన్ని విధాలుగా సంరక్షిస్తాడు. మీరు దేనికీ చింతించవలదు', అని ధైర్యం చెప్పారు. చింత అనేది మానవునికి భయంకరమైన శత్రువు.

**పుట్టుట ఒక చింత భూమి నుండుట చింత**
**సంసార మొక చింత చావు చింత**
**బాల్యమంతయు చింత వార్ధక్యమొక చింత**
**జీవించుటొక చింత చెడుపు చింత**
**కర్మలన్నియు చింత కష్టములొక చింత**

sri sathyasaivachanamrutam

సంతసమొక చింత వింత చింత
సర్వ చింతలు బాపెడి స్వామి భక్తిని
గొనుడు ప్రజలార ఇకనైన కోర్కెమీర!

మీరు భగవంతుణ్ణి అనుసరించండి. భగవంతుడే అన్ని విధాలుగా మనకు రక్షణగా ఉంటాడు. ఈ ప్రపంచమంతయు భగవంతుని చేతి యందే ఉంటున్నది. కాని, మీరు ఈ సంగతిని గుర్తించుకోవడం లేదు. మీరు కేవలం దేహమును మాత్రమే చూస్తున్నారు. దేహాభిమానము చేత మాయలో పడిపోతున్నారు.

దేహము పాంచభౌతికము దేహము కూలక తప్పదెప్పుడున్
దేహి నిరామయుండు గణుతింపగ దేహికి చావు పుట్టుకల్
మోహ నిబంధ బంధనల ముద్రలు లేవు, నిజంబు జూడ యా
దేహియె దేవదేవుడు, మదిన్ గణుతింపగ ఆత్మరూపుడౌ.

"ఓ ప్రజలారా! ఇకనుండైనా మీరు దేహిని నమ్మండి. దేహియే లేకుండిన దేహము ఏవిధంగా పనిచేయగలదు? కనుక, దేహినే మీరు ధ్యానించండి. దేహిపై మీ దృష్టిని నిల్పుకోండి. దేహియే అందరినీ కాపాడుతాడు", అని ద్రౌపది బోధించింది.

అప్పుడు ధర్మజుడు, 'ద్రౌపదీ! నీవు చాలా గట్టిదానవు. సాక్షాత్తు కృష్ణుడే నీద్వారా మాట్లాడుతున్నాడని నాకనిపిస్తోంది. కృష్ణునిపై నీకు గల విశ్వాసం అంత దృఢమైనది', అన్నాడు.

'ధర్మజా! నీవు ద్రౌపది సలహాను అనుసరించు. ప్రజలకు ఏమి కావలసినా నేను చూసుకుంటాను. నీవు ధైర్యంగా వుండు', అని కృష్ణుడు చెబుతున్నట్లు అతనికి అనిపించింది. అప్పుడు ధర్మజునికి కొంత ధైర్యం వచ్చింది. 'కృష్ణా! నీవే మా సర్వస్వం. నీ శక్తిచేతనే మేము కత్తిని పట్టి యుద్ధం చేయగలిగాము. నీవు లేనప్పుడు మాకు ఈ కత్తి ఎందుకు? రాజ్యమెందుకు? కనుకనే, ఈనాడు మేము కత్తిని విడిచి పెట్టి మీదగ్గరకు వస్తున్నాము. ఈ చంటిబిడ్డను కాపాడి అభివృద్ధికి తేవలసిన బాధ్యత మీదే!' అని ప్రార్థించాడు.

sri sathyasai vachanamrutam

ధర్మజుడు ప్రజల మధ్యకు వెళ్ళి, 'మీరందరూ ధైర్యంగా ఉండండి. ఎలాంటి పరిస్థితిలోనూ భయభ్రాంతులకు చోటివ్వకండి. మన వెంట కృష్ణపరమాత్మ ఎల్లప్పుడు ఉన్నాడు. సర్వత్రా ఉన్నది కృష్ణపరమాత్మయే. ఇదంతా కృష్ణునియొక్క లీలయే. దైవలీలలు చిత్రవిచిత్రమైనవి. అవి ఇట్టివి, అట్టివి అని చెప్పడానికి వీలుకాదు. ఏదీ తనంతట తానుగా మనకు తెలుపడు. మనమే ప్రయత్న పూర్వకంగా తెలుసుకోవాలి. భగవంతుడు ఆత్మస్వరూపుడై సర్వత్రా వ్యాపించియున్నాడు. తాను అన్నింటియందు వుండికూడను మనకు కనిపించడం లేదు', అన్నాడు. ధర్మజుని మాటలు విని ప్రజలందరూ ధైర్యం తెచ్చుకున్నారు.

రెండవ దినము పరీక్షిత్తు సామంత రాజులందరినీ సమావేశ పరచాడు. 'ఈ పిల్లవానికి ధైర్యం చాలడం లేదు. కనుకనే, రాజు లందరినీ ఇక్కడికి రప్పిస్తున్నాడు', అని అనుకున్నారు ప్రజలు. రాజులందరూ వచ్చి కూర్చున్నారు. పరీక్షిత్తు వారినుద్దేశించి ప్రసంగిస్తూ, 'రాజులారా! మీకందరికీ నేను నమస్కరిస్తున్నాను. నమస్కారము చేయడం తప్ప నాకేమీ తెలియదు. నేను బాలుడను, ఎలాంటి అనుభవమూ లేని పసివాడను. నాకు మీ సహాయం అవసరం. నేను మీకు, మీరు నాకు పరస్పరం సహాయ సహకారాలను అందించుకోవాలి", అని చెప్పి 'మీ ఉద్దేశ్యమేమిటో నాకు తెలియ జేయండి', అన్నాడు. అప్పుడు సామంతులు, 'మహారాజా! మీరు మాకు నాయకులుగా ఉండండి. మేము మీకు అన్ని విధాలుగా మా సహాయ సహకారాల నందిస్తాము', అన్నారు. అందరూ కలసి రాజ్యముయొక్క స్థితి, గతులను సమీక్షించి ఎక్కడి వారు అక్కడికి వెళ్ళిపోయారు.

ఇంతలో కొందరు శత్రురాజులు ఏకమై పరీక్షిత్తుపై దండెత్తి వచ్చారు. యుద్ధం ప్రారంభమైంది. అప్పుడు సామంత రాజులందరూ కలిసి పరీక్షిత్తుకు వెన్నెముకగా నిలిచారు. పరీక్షిత్తుకు మంచి ధైర్యం వచ్చింది. అతను అర్జునుని మనుమడు కదా! 'అర్జున, ఫల్గున, పార్థ, కిరీటి, సవ్యసాచి, శ్వేతవాహన, భీభత్స, విజయ, కృష్ణ, ధనుంజయ' అని తన పితామహుని తలుచుకుని యుద్ధం చేశాడు. ఆవిధంగా ప్రార్థించేసరికి అర్జునుడు ప్రత్యక్షంగా తన ఎదుట నిలిచి, 'నాయనా! నీవు అధైర్యపడకు. మేము ఐదుమందిమీ

srisathyasaivachanamrutam

నీవెంటనే ఉన్నాము. నీ మంచిచెడ్డలను మేము గమనిస్తున్నాము. నీ యోగక్షేమాలను మేము చూసుకుంటాము. నీవు ఎవ్వరికీ భయపడనక్కర్లేదు. ఎంత భీకర యుద్ధం చేయవలసి వచ్చినా నీవు భయపడకు. నీవు ధైర్యంగా ఉండు', అని తనకు చెప్పినట్లు అనిపించింది.

అదేవిధంగా, ద్రౌపదికూడా చిన్నప్పటినుండి పరీక్షిత్తుకు అనేకవిధములుగా ధైర్యం నూరిపోసింది. ద్రౌపది సామాన్యమైన స్త్రీ కాదు. ఆమె స్త్రీజాతి అంతటికీ లీడర్ వంటిది. ఆమె సభలు, సమావేశాల్లో కూడా ప్రసంగించేది. హస్తిన సింహాసనమునకు పరీక్షిత్తే వారసుడు కనుక, అతనికి ఎలాంటి పరిస్థితినైనా ఎదుర్కోగలిగేటట్లు ఉగ్గుపాలతో ధైర్యాన్ని నూరిపోస్తూ, చక్కని తర్ఫీదు నిచ్చింది. అయితే, పిన్న వయస్సులోనే రాజ్యపరిపాలనా భారాన్ని తాను మోయవలసివస్తుందని అప్పట్లో ఆ బాలునికి తెలియదు.

ద్రౌపది పరీక్షిత్తును మంచిస్థితికి తెచ్చింది. అతను సింహాసనము నధిష్ఠించినప్పుడు అంతకుపూర్వము ద్రౌపది చెప్పిన మాటలను గుర్తు చేసుకున్నాడు: 'నాయనా! నీవు ప్రజలను ప్రాణ సమానంగా ప్రేమించు. వారికి సుఖసంతోషాలను అందించు. నీవు చిన్నవాడవు. కాబట్టి, యుద్ధాలకు దూరంగా ఉండు. ఇప్పుడే యుద్ధంలో ప్రవేశిస్తే దేశానికి హాని కలుగుతుంది.'

ప్రజలందరూ పరీక్షిత్తును, 'మహారాజా!' అని సంబోధిస్తూ గౌరవిస్తూ వచ్చారు. అంతటి సద్గుణవంతుడు, వీరుడైన మహారాజు తమకు లభించినందుకు వారు ఆనందంతో పొంగిపోయారు. పరీక్షిత్తు వంటివాడు మహారాజుగా ఉండడం తమకు గర్వకారణంగా వాళ్ళు భావించారు. పరీక్షిత్తు చెప్పాడు, 'ప్రజలారా! చిన్న పిల్లవాడినైన నేను ఏవిధంగా రాజ్యాన్ని పరిపాలించగలనని మీరు భయపడకండి. దైవానుగ్రహముచేత నేను రాజ్యాన్ని సమర్థవంతంగా పరిపాలించ గలనని మీకు హామీ ఇస్తున్నాను. దైవము తప్ప మనకు మరే ఇతర ఆధారమూ లేదు. కనుక, మనం దైవాన్ని నమ్ముకొని మన కర్తవ్యాన్ని నిర్వర్తిద్దాం.'

ఈ సందర్భంలో ధర్మరాజు, ద్రౌపది పరీక్షిత్తుయొక్క గుణ గణాలను, ధైర్యసాహసాలనుగురించి ప్రజలకు చెప్పిన మాటలను మనం గుర్తు చేసుకోవాలి: 'ప్రజలారా! పరీక్షిత్తు చంటిబిడ్డ. అతనిని రక్షించడానికి మాకెంతటి బాధ్యత ఉన్నదో



sri sathyasai vacheramrutam

మీకుకూడా అంతటి బాధ్యత ఉన్నది. మీరందరూ కలిసి ఆ పిల్లవానిని జాగ్రత్తగా చూసుకోండి. మాకింకేమీ రాజ్యములుగాని, భోగభాగ్యములుగాని అక్కరలేదు. ఈ పిల్లవానిని మీరిప్పుడు జాగ్రత్తగా చూసుకుంటే వాడు పెద్దవాడైన తరువాత మిమ్మల్నందరినీ కాపాడుతాడు. అందరికీ సుఖసంతోషాలను అందిస్తాడు. పరీక్షిత్తు సామాన్యమైన బాలుడు కాడు. ఇతను మనకు భగవంతునియొక్క వరప్రసాదం. కాబట్టి, ఇతనిని మీరు జాగ్రత్తగా చూసుకోండి. అంతా దైవనిర్ణయానుసారమే జరుగుతుంది. భగవత్సంకల్పాన్ని ఎవ్వరూ అడ్డుకోలేరు.'

ఈవిధంగా, ద్రౌపది, ధర్మరాజు ప్రజలకు ధైర్యం చెప్పి, పరీక్షిత్తుకు పట్టాభిషేకం జరిపించారు. ఆనాటి రాజకీయ వ్యవహారాలు అంత సూక్ష్మమైనవిగా, ఉన్నతమైనవిగా ఉండేవి. పాలకులు ప్రజలను కన్నబిడ్డలవలె క్షేమంగా చూసుకోవాలనే నియమాన్ని పాటించేవారు. ప్రజలుకూడా ప్రభువునందు భక్తివిశ్వాసాలు కలిగియుండేవారు. ప్రభువును కన్నతండ్రిగా భావించే ప్రజలు, ప్రజలను కన్నబిడ్డలుగా చూసుకునే ప్రభువు వున్నప్పుడు ఇంక రాజ్యానికి ఏమి కొదువ!

ఈనాడు కొందరు ఏరీతిగా ఉన్నారంటే... తాము చేయరు, చేసేవారిని చేయనివ్వరు. తాము చేయపోతే ప్రక్కన ఉండి చేసేవారిని చేయనివ్వడం మంచిది కదా! ధర్మజుడు చేసింది ఇదే! పరీక్షిత్తుకు శిక్షణ ఇచ్చే విషయంలో తానేమీ జోక్యం చేసుకోకుండా ఆ బాధ్యతను ద్రౌపదికే వదలిపెట్టాడు. ఆమె ఆ పిల్లవానిని చక్కని పరిపాలనా దక్షునిగా తీర్చిదిద్దింది. ఈనాడు ఆవిధంగా పిల్లలపట్ల శ్రద్ధ వహించి బోధించేవారు ఎవరైనా ఉన్నారా? బోధించేవారు ఉన్నా వినేవారు లేరు. కాని, పరీక్షిత్తు అలా కాదు. కొన్ని విషయాలు తనకు ఎవ్వరూ చెప్పక మునుపే గ్రహించి, తదనుగుణంగా నడుచుకునేవాడు. ఎటువంటి అడ్డంకులు ఎదురైనా ధైర్యంతో ముందంజ వేసి విజయం సాధించాడు. 'ధైర్యం సర్వ సాధకం'. ధైర్యమే నిజమైన బలము. అట్టి బలమును ఆధారం చేసుకొని పరీక్షిత్తు దేశాన్ని అభివృద్ధి పథంలో నడిపించాడు. మంత్రులు, సామంతులు, ప్రజలు అందరూ ఐకమత్యంగా ఉండి పరీక్షిత్తుకు తగిన సహాయ సహకారముల నందించారు. 'యూనిటీ'



srisathyasaivachanamrutam

ఉన్నచోట 'ప్యూరిటీ' ఉంటుంది. 'ప్యూరిటీ' ఉన్నచోట 'డివినిటీ' సాక్షాత్కరిస్తుంది. మనం 'యూనిటీ'ని పోషించు కుంటే చాలు; సకల కార్యములు సఫలమవుతాయి. కాని, ఈనాడు 'యూనిటీ' లోపించడంచేతనే దేశం అనేక విధములైన బాధలను అనుభవించవలసి వచ్చింది.

బాలుడైన పరీక్షిన్మహారాజు చిరునవ్వు తొణికిసలాడే మోముతో అందరినీ ప్రేమగా పలుకరించేవాడు. 'నేను పిల్లవాడను. నా పాలనలో ఏమైనా పొరపాట్లు జరుగవచ్చును. నాకు తెలియకుండా ఏమైనా తప్పు జరిగితే నన్ను క్షమించండి', అని కోరేవాడు. భగవంతుడే తనవెంట ఉండి ముందుకు నడిపిస్తున్నాడని అతను విశ్వసించాడు. భగవంతుణ్ణి ఆధారం చేసుకొని తన కర్తవ్య కర్మలను నిర్వర్తించాడు. కనుకనే, అతనిని అన్నివిధాలుగా భగవంతుడే కాపాడుతూ వచ్చాడు.

విద్యార్థులారా! మీరందరూ పరీక్షిత్తును ఆదర్శంగా తీసుకోవాలి. అతనివలె మీరుకూడా ప్రజలకు తగిన ఉత్సాహ ప్రోత్సాహముల నందించాలి. రేపటి దినము మరింత వివరంగా బోధిస్తాను. మనకు ఈ దసరా ఉత్సవాలను గొప్పగా జరుపుకోవడం ప్రధానం కాదు. మీలో సద్గుణములను పెంపొందించి, మిమ్మల్ని సన్మార్గంలో ప్రవేశపెట్టాలన్నదే నా ఉద్దేశ్యం. మీకందరికీ ఆశీర్వాదములు అందిస్తున్నాను. మీరందరూ ఆదర్శప్రాయులుగా నిలవాలని ఆశిస్తున్నాను. అప్పుడే దేశము తన ప్రాచీన వైభవాన్ని సంతరించుకోగలదు. ఏ కాలమునందుకూడను ఇట్టిది జరుగలేదు. ఈనాడు ఇట్టి అవకాశము పొందగలిగిన మీరు చాలా అదృష్ట వంతులు. ఒకవైపున వేదఘోష జరుగుతున్నది. ఇంకొకవైపున భగవన్నామస్మరణ జరుగుతున్నది. నామస్మరణే తరణోపాయము. ఈరీతిగా, తుదిశ్వాసవరకు మీరు వేదపారాయణమును, నామ స్మరణను కొనసాగించి మీ జీవితాలను చరితార్థం చేసుకోవాలని నేను ఆశిస్తున్నాను.

స్త్రీలందరుకూడా ద్రౌపదివలె జీవితంలో ఎదురయ్యే సవాళ్ళను భగవంతునిపట్ల అచంచలమైన విశ్వాసంతో, ధైర్య సాహసములతో ఎదుర్కోవాలి. మీరు మీ గృహాలను ఆవిధంగా తీర్చిదిద్దుకోవాలి.

శ్రీవారి దివ్యబోధతేదీ **08.10.2005**

sri sathyasai vachanamrutam